నమస్తే తెలంగాణ
కరీంనగర్
3 | కరీంనగర్, ఆదివారం 2 జూన్ 2024 | KARIMNAGAR

అమరులకు ఘన నివాళి

- హైదరాబాద్‌లో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు
- హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు
- నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

అమరుల స్తూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

నేడు (ఆదివారం): దశాబ్ది ముగింపు వేడుకల సభను హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నిర్వహిస్తారు. అదేరోజు హైదరాబాద్‌లో పలు దవాఖానలు, అనాథ శరణాలయాల్లో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతోపాటు ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు తరలివెళ్లనున్నారు.

రేపు (సోమవారం): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, జాతీయ జెండాను ఎగరవేస్తారు. ఆయా జిల్లాల్లోని దవాఖానలు, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తారు.

కొవ్వొత్తుల ర్యాలీలో బీఆర్ఎస్ పెద్దపల్లి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థులు కొప్పుల ఈశ్వర్, బోయినపల్లి వినోద్‌కుమార్

ఎమ్మెల్సీ ఎల్ రమణ, సిరిసిల్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య

కరీంనగర్, జూన్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. శనివారం రాత్రి గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న అమరజ్యోతి వరకు అమర జ్యోతుల (కొవ్వొత్తుల) ర్యాలీని తీశారు. ఈ సందర్భంగా అమరులకు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత హాజరై, రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటాలు, చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో త్యాగాలకోర్చి సాధించుకున్న తెలంగాణలో పదేండ్ల స్వయంపాలనకాలం దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలిపిందని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను వృథా పోనీయకుండా పదేండ్ల పాటు ప్రజల భాగస్వామంతో సాధించిన ప్రగతిని ప్రజాసంక్షేమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. బాధ్యతతో, చిత్తశుద్ధితో, వ్యక్తిగత ద్వేష భావనలకు తావివ్వకుండా, తెలంగాణ సమాజ ప్రగతి, సంక్షేమమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన నిజమైన ప్రజా సంక్షేమ పాలన స్ఫూర్తితో ముందుకెళ్లడం ద్వారానే ప్రస్తుత ప్రభుత్వం అమరుల ఆకాంక్షలను నెరవేర్చగలదని కేసీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రకటించిన విధంగా ఆది, సోమవారాల్లో పార్టీ నిర్వహించే దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొని, నాటి ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ.. విజయవంతం చేయాలని మరోసారి తెలంగాణ వాదులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఇక్కడ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులు బోయినపల్లి వినోద్ కుమార్, కొప్పుల ఈశ్వర్ ఉన్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

జైబోలో హన్మాన్ కీ

- వైభవంగా పెద్ద జయంతి
- కొండగట్టుకు పోటెత్తిన భక్తజనం
- లక్షా50వేల మందికిపైగా తరలివచ్చిన దీక్షాపరులు
- సాఫీగా మాల విరమణలు

కొండగట్టులో అంజన్న మూలవిరాట్

కొండగట్టుపై నినదిస్తున్న దీక్షాపరులు

మల్యాల, జూన్ 1 : 'రామ లక్ష్మణ జానకీ.. జై బోలో హన్మాన్‌కీ' 'శ్రీ రామ జయ రామ, జయ జయ రామ' అంటూ రామ నామ సంకీర్తనలతో కొండగట్టు మార్మోగింది. శనివారం హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా కొండంతా కిక్కిరిసిపోయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షా 50వేల మందికిపైగా తరలివచ్చిన దీక్షా పరులతో కాషాయవర్ణ శోభితమైంది. ఎక్కడా ఇబ్బంది లేకుండా మాల విరమణ సాఫీగా సాగింది. జయంతి సందర్భంగా ఉదయం నుంచే స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేయడం, భద్రాద్రి ఆలయం తరపున తొలి సారి పంపిన పట్టువస్త్రాలతో అంజన్న మెరిసిపోవడంతో భక్తజనం తరించి పులకించింది. ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్ననేపథ్యంలో ఆర్జిత సేవలను ఆదివారం వరకు రద్దు చేసిన ఆలయ అధికారులు, తిరిగి సోమవారం ప్రారంభించనున్నారు. జయంతి సందర్భంగా లక్ష తమలపాకులతోపాటు ఓ భక్తుడు సమర్పించిన 11 రకాల పండ్లతో సుందరంగా అలంకరించారు. యాగశాలలో వేదపండితులు, అర్చకులు త్రైయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కాగా, ఉత్సవాల్లో తొలి రోజు, రెండో రోజు సాయంత్రం వరకు భుక్తుల రాక నామమాత్రంగానే ఉండగా.. శుక్రవారం సాయంత్రం నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. రాత్రి ఏడు గంటల తర్వాత ప్రవాహంలా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా తరలివచ్చిన దీక్షాపరులు గుట్ట కింద సేదతీరి ఎండ తగ్గగానే గుట్ట మీదికి వెల్లువలా తరలివచ్చారు. దీక్షలను విరమించి తర్వాత తలనీలాలు సమర్పించి, పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి, స్వామి వారిని దర్శించుకున్నారు.

మాల విరమణ మండపంలో దీక్షను విరమిస్తున్న భక్తులు

సుల్తానాబాద్ రాకముందు రోడ్డుపై ప్రమాదకరంగా వెళ్తున్న లారీ (వైరల్ అవుతున్న వీడియోలోని దృశ్యం)

రాంగు రూట్‌లో వాహనాలను ఢీకొని వెళ్తూ..

చివరకు చెట్టును ఢీకొని ఆగి..

లారీ బీభత్సం..

నిర్లక్ష్యమే అసలు కారణం!

- మద్యం మత్తులో వాహనం డ్రైవింగ్
- అదుపుతప్పి రోడ్డుపై అటూ ఇటూ
- ప్రమాదానికి ముందే డయల్ 100కు ఫోన్!
- ఆ తర్వాత కొద్ది సేపటికే ఆరు బైక్‌లు, గప్‌చుప్ బండిని ఢీకొట్టిన లారీ
- సోషల్‌మీడియాలో వీడియో వైరల్
- పోలీసులు సకాలంలో స్పందిస్తే ప్రమాదం తప్పేదనే అభిప్రాయాలు
- ఈ ఘటనలో గాయపడ్డ తల్లి మృతి
- విషమంగానే కొడుకు పరిస్థితి

సుల్తానాబాద్, జూన్ 1 : సుల్తానాబాద్‌లో లారీ బీభత్సం వెనుక నిర్లక్ష్యమే అసలు కారణంగా కనిపిస్తున్నది. డ్రైవర్ మద్యం మత్తులో అదుపుతప్పి రోడ్డుపై ప్రమాదకరంగా వెళ్తుండగా.. వెనుకే వస్తున్న ఓ వాహనదారుడు గుర్తించి, డయల్ 100కు ఫోన్ చేసినట్టు తెలుస్తున్నది. అందుకు సంబంధించిన ఓ వీడియో వైరల్ అవుతున్నది. అయితే అప్పుడే పోలీసులు స్పందించి ఉంటే భారీ ప్రమాదం తప్పేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ చనిపోగా.. ఆమె కొడుకు పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నది. అసలేం జరిగిందంటే..శుక్రవారం సాయంత్రం సుల్తానాబాద్‌లో ఓ లారీ బీభత్సం సృష్టించింది. డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో వాహనం అదుపుతప్పింది. పూసల రోడ్డు చౌరస్తా వద్ద రోడ్డుపై ముగ్గురిని ఢీకొని రాంగ్‌రూట్‌లో రైట్ సైడ్‌కు వెళ్లింది. మళ్లీ డివైడర్ ఎక్కి లెఫ్ట్ సైడ్ వెళ్తూ ఆరు బైక్‌లు, గప్‌చుప్ బండిని ఢీకొట్టుకుంటూ.. చివరికి ఓ చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఆ చెట్టు లేకపోతే భారీ ప్రమాదమే జరిగేది. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడగా, అందులో ఓ ప్రైవేట్ పాఠశాల టీచర్ నసీమా శనివారం చనిపోయింది. ఆమె కొడుకు దిలీష్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. అయితే ఈ ప్రమాదానికి ముందు తీసిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో లారీ అదుపు తప్పి రోడ్డుపై అటూ ఇటూ ప్రమాదకరంగా వెళ్తుండగా.. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి నుంచి వెనుకే వస్తున్న ఓ వాహనదారుడు గమనించి, వీడియో తీస్తూ.. సుల్తానాబాద్‌కు మూడు నాలుగు కిలోమీటర్ల ముందే డయల్ 100కు ఫోన్ చేసినట్టు తెలుస్తున్నది. అయితే పోలీసులు అప్పుడే స్పందించి ఉంటే ఈ ముప్పు తప్పి ఉండేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విమర్శిస్తున్నారు.

ప్రాణం తీసిన పాముకాటు

వైష్ణవి (ఫైల్)

- ఫ్రిడ్జ్‌లో నుంచి వాటర్ బాటిల్ తీస్తుండగా బాలిక కాలిపై కాటు
- పరిస్థితి విషమించి మృత్యువాత

పెద్దపల్లి టౌన్, జూన్ 1 : అప్పటిదాకా ఇంట్లో సంతోషంగా ఆడిపాడిన ఆ బాలిక అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరింది. ఫ్రిడ్జ్ కింద ఉన్న పాము కాటు వేయడంతో ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్‌కు చెందిన నిట్టూరు సంతోష్, లత దంపతులకు కూతురు వైష్ణవి(12), కొడుకు సాకేత్ ఉన్నారు. కొన్నేళ్ల క్రితమే సంతోష్ మరణించగా లత తన కొడుకు, కూతురును తీసుకుని తల్లిగారిల్లయిన పెద్దపల్లిలోని సాగర్ రోడ్డులో నివా సం ఉంటున్నది. అక్కడే పని చేసుకుంటూ.. ఇద్దరు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో కూతురు వైష్ణవి తమ ఇంట్లోని ఫ్రిడ్జ్‌లో నుంచి వాటర్ బాటిల్ తీసుకుంటున్నది. ఆ సమయంలో అప్పటికే ఫ్రిడ్జ్ కింద ఉన్న పాము బాలిక కాలుపై కాటు వేసింది. అయితే ఎలుక కొరికిందనుకొని కుటుంబ సభ్యులకు చెప్పలేదు. రాత్రి సమయంలో వైష్ణవి ఉన్నట్టుండి అపస్మారక స్థితిలోకి చేరి.. కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురు ఇలా పాముకాటుతో చనిపోవడంతో ఆ తల్లి జీర్ణించుకోలేక పోయింది. గుండెలవిసేలా రోదిస్తున్నది. తల్లి లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గ్రూప్-1 హాల్‌టికెట్ల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 1 : తెలంగాణ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్‌టికెట్లు శనివారం విడుదలయ్యాయి. ఈ నెల 9 ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రిలిమినరీ పరీక్ష ఉండగా, అక్టోబర్ 21 నుంచి మెయిన్ పరీక్షలు జరుగనున్నాయి. అభ్యర్థులు తమ వివరాలు లాగిన్‌లో ఎంటర్ చేసి హాల్‌టికెట్లు పొందవచ్చని అధికారులు వెల్లడిస్తున్నారు.tspsc.gov.inలో హాల్‌టికెట్లు పొందవచ్చని సూచిస్తున్నారు.

జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ముజామ్మిల్ ఖాన్

కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి

పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

రామగిరి, జూన్ 1: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశించారు. సెంటినరీకాలనీలోని జేఎన్‌టీయూ కళాశాల హాల్‌లో ఎన్నికల లెక్కింపు కోసం ఏర్పాట్లను శనివారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద బారికేడ్లు ఉంచాలని, ఎన్నికల ఏజెంట్లు, ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి ప్రత్యేక ఎంట్రన్స్ ఉండేలా చూడాలన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను కూడా పరిశీలించారు. పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, పాసులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రం లోపలికి అనుమతించాలని అన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ సీల్‌ను పరిశీలించారు.